# రేవంత్ కన్నా.. కేసీఆర్ పాలనే బెటర్



కేసీఆర్ పాలన బాగుందన్న 44 శాతం ప్రజలు
వాయిస్ ఆఫ్ తెలంగాణ అండ్ ఆంధ్రా (వోటా) సర్వే వెల్లడి

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి సర్కారు కన్నా గత కేసీఆర్ పాలనే బాగుందని ప్రజలు భావిస్తున్నారని వాయిస్ ఆఫ్ తెలంగాణ అండ్ ఆంధ్రా (వోటా) సంస్థ సర్వే తేల్చింది. రాష్ట్రంలోని 44 శాతం మంది ప్రజలు కేసీఆర్ పాలన బాగుందని చెప్పగా, రేవంత్‌రెడ్డి సర్కారు బాగుందని 35 శాతం మంది అభిప్రాయపడ్డారు. రేవంత్‌రెడ్డి పని తీరుకు ఎన్ని మార్కు లేస్తారంటే ఒక్కరు కూడా వంద మార్కులు వేయలేదు. 75 మార్కులేసిన వారు కేవలం 6 శాతం కాగా, 35 శాతం మంది 50 మార్కులేశారు. అత్యధికంగా 59 శాతం మంది 25 కన్నా తక్కువ మార్కులు వేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా వోటా సంస్థ రాష్ట్రవ్యాప్తంగా శాంపిల్ సర్వేను నిర్వహించింది. నవంబర్ 25 నుంచి డిసెంబర్ 4 వరకు ఈ సంస్థ ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించింది. ఆ సర్వే వివరాలను సంస్థ సీఈవో కంభాలపల్లి కృష్ణ బుధవారం మీడియాకు విడుదల చేశారు.


### సర్వేలోని కొన్ని అంశాలు..

- ఏడాది కాంగ్రెస్ ప్రజాపాలన చెత్తగా ఉందని 12 శాతం, అస్సలు బాగాలేదని 35 శాతం, ఫరవాలేదని 22శాతం మంది అభిప్రాయపడ్డారు. కేవలం 31 శాతం మంది సంతృప్తి వ్యక్తంచేశారు.
- ప్రజావాణి దరఖాస్తులు పరిష్కారం కావడంలేదని 23 శాతం చెప్పగా, కొన్ని మాత్రమే పరిష్కారమవుతాయని 34 శాతం, తమకు తెలియదని 27 శాతం, పరిష్కారమవుతున్నాయని కేవలం 16 శాతం మంది చెప్పారు.
- కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అమలవుతాయన్న నమ్మకం తమకు లేదని అత్యధికులు అభిప్రాయపడ్డారు. ఆరు గ్యారెంటీలు అమలవుతాయనుకుంటున్నామని 14శాతం మంది మాత్రమే చెప్పారు.
- కులగణన అవసరమని కేవలం 50 శాతం, అవసరంలేదని 23 శాతం, సర్వే గణాంకాలు బయటికి రావని మరో 18 శాతం మంది అభిప్రాయపడ్డారు.
- హైడ్రా తమ ప్రాంతానికి రావొద్దని 43 శాతం మంది చెప్పగా, రావాలని 12 శాతం మంది మాత్రమే చెప్పారు.
- మూసీ ప్రక్షాళన వ్యాపారం కోసమని 16 శాతం, ప్రక్షాళనే అవసరం లేదని 15 శాతం, ప్రక్షాళన పూర్తిచేయడం కష్టమని 19 శాతం మంది చెప్పారు.
- రేవంత్‌రెడ్డి సోదరులు పాలనలో జోక్యం చేసుకుంటున్నారని 45 శాతం చెప్పగా, మొత్తం పాలన గాడి తప్పిందని 12 శాతం అభిప్రాయపడ్డారు.
- కేసీఆర్, కేటీఆర్‌లను అరెస్టు చేయరని 54 శాతం, అరెస్టు చేస్తారని 7శాతం అభిప్రాయపడ్డారు. ఏమైనా జరగొచ్చని మరో 25 శాతం మంది అన్నారు.

### సర్వేలో జనం అభిప్రాయాలు

- కూరలో ఉప్పులేనట్టు రేవంత్ పాలన ఉంది. రేవంత్ భాషను మార్చుకోవాలి.
- రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుండు సున్నా తప్పదు
- కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయడం రేవంత్ తరంకాదు.
- కేసీఆర్ ఉంటే ఇప్పటికి రెండుసార్లు రైతుబంధు వచ్చేది.
- ధరణి సమస్యలింకా పరిష్కారంకాలేదు. కౌలు రైతులను పట్టించుకోలేదు.
- కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలనే రేవంత్ తన ఖాతాలో వేసుకున్నాడు.
- తులం బంగారం ముచ్చట తుంగలో తొక్కారు. రేషన్‌కార్డులివ్వకుండా ఎన్ని పథకాలు పెడితే ఏం లాభం
- చివరి రెండేండ్లు భట్టి విక్రమార్కకు ముఖ్యమంత్రి పదవినివ్వాలి.
- కేసీఆర్ ప్రజలకు అన్నం పెడితే.. రేవంత్ సున్నం పెడుతున్నాడు.
- మార్పు కోసం కాంగ్రెస్‌కు ఓటేస్తే రేవంత్ మాడ పగలగొడుతున్నాడు.

## లోకం పోకడ




# కాంగ్రెస్ పాలనలో అటకెక్కిన హామీలు




ఎన్నికల ప్రచారంలో మభ్యపెట్టే మ్యానిఫెస్టో | అమలుకాని హామీలు, దిక్కులేని డిక్లరేషన్లు | గ్యారెంటీలు 6, హామీలు 13, అమలైంది 2 | ఏడాది పాలనలో మాట తప్పిన కాంగ్రెస్

హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో ప్రధాన ప్రచారాస్త్రం ఆరు గ్యారెంటీలు. పేరుకే ఇవి ఆరు గ్యారెంటీలు అయినా మొత్తం 13 హామీలు ఇచ్చింది. ప్రతీ వేదికలోనూ, ప్రతి నాయకుడి నోట గ్యారెంటీల జపమే వినిపించింది. ఎన్నికల సమయంలోనే లక్షలాది కుటుంబాలకు గ్యారెంటీ కార్డులు పంచింది. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోగా హామీలన్నీ అమలు చేస్తామంటూ ప్రజలను నమ్మించింది. రైతులు, యువత, మహిళలు, బీసీ ఇలా అన్ని వర్గాలను మభ్యపెట్టేలా మ్యానిఫెస్టో, డిక్లరేషన్లను ప్రకటించింది. కానీ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా గ్యారెంటీల అమలును అటకెక్కించింది.

### చెప్పింది కొండంత.. చేసింది గోరంత

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 13 హామీల్లో ఇప్పటివరకు అమలు చేసింది 6 మాత్రమే. ఇందులో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్య శ్రీ పెంపు మాత్రమే అమలవుతున్నాయి. మిగతా హామీలైన రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, పంటకు రూ.500 బోనస్, మండలానికో ఇంటర్నేషనల్ స్కూళ్ల ఏర్పాటు హామీలు తూతూమంత్రంగా మారాయి.



## గ్యారెంటీలు, అమలు స్థితి

### గ్యారెంటీ-1: మహాలక్ష్మి

హామీ 1- రాష్ట్రంలో 18 ఏండ్లకు పైబడిన ప్రతీ మహిళకు నెలకు రూ.2500 బ్యాంకు ఖాతాలో జమ

**అమలు పరిస్థితి:** అమలు కాలేదు

**హామీ-2:** తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి రూ.500కే గ్యాస్ సిలిండర్ అందజేస్తాం

**అమలు పరిస్థితి:** అరకొరగా అవుతున్నది. తెల్లరేషన్ కార్డు ఉండి, గ్యాస్ కనెక్షన్ ఉన్న వాళ్లు రాష్ట్రంలో 63 లక్షల మంది ఉన్నట్టు అధికారులు గుర్తించారు. కానీ ప్రభుత్వం 40 లక్షల మందికే రాయితీ ఇస్తున్నది

**హామీ-3:** మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

**అమలు పరిస్థితి:** అమలు అవుతున్నది

### గ్యారెంటీ-2: రైతు భరోసా

**హామీ -1:** ఏటా రైతులకు, కౌలు రైతులకు పెట్టుబడి సాయం కింద ఎకరానికి రూ.15 వేలు అందజేస్తాం

**అమలు పరిస్థితి:** అమలు కాలేదు

**హామీ-2:** వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12వేలు బ్యాంక్ ఖాతాలో జమ చేస్తాం

**అమలు పరిస్థితి:** అమలు కాలేదు

**హామీ-3:** వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్

**అమలు పరిస్థితి:** అరకొరగా అమలు. బోనస్ సన్నవడ్లకే పరిమితమైంది. యాసంగి పంటకు బోనస్ ఇవ్వనేలేదు.

### గ్యారెంటీ-3: గృహజ్యోతి

రేషన్‌కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పంపిణీ

**అమలు పరిస్థితి:** అరకొరగా అమలు. రాష్ట్రంలో 90 లక్షలకుపైగా రేషన్‌కార్డులు ఉన్నాయి. కానీ 42 లక్షల మందికి మాత్రమే గృహజ్యోతి అమలు అవుతున్నట్టు విద్యుత్‌శాఖ వర్గాలు చెప్తున్నాయి.

### గ్యారెంటీ 4: ఇందిరమ్మ ఇండ్లు

**హామీ-1:** ఇల్లు లేని వారికి ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం.

**అమలు పరిస్థితి:** అమలు కాలేదు. ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించినా కనీసం లబ్ధిదారుల ఎంపిక కూడా జరగలేదు.



**హామీ 2:** తెలంగాణ ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం

**అమలు పరిస్థితి:** అమలు కాలేదు




### గ్యారెంటీ 5: యువవికాసం

**హామీ1:** విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు

**అమలు పరిస్థితి:** అమలు కాలేదు

**హామీ 2:** ప్రతీ మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూళ్ల ఏర్పాటు

**అమలు పరిస్థితి:** అరకొరగా అమలు. ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నది. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేస్తామని చెప్తున్నది. విడతలవారీగా మంజూరు చేస్తున్నది. మొదటి విడతలో 28 స్కూళ్లు మంజూరు కాగా డిసెంబర్ 1న రెండో విడతకు శంకుస్థాపన చేయనున్నారు.



### గ్యారెంటీ 6: చేయూత

**హామీ-1:** వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళల పింఛన్ రూ.4వేలకు పెంచుతాం

**అమలు పరిస్థితి:** అమలు కాలేదు

**హామీ-2:** ఆరోగ్యశ్రీ కవరేజీని 10 లక్షలకు పెంచి, రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమాగా అమలు

**అమలు పరిస్థితి:** అమలు అవుతున్నది.

# లోపభూయిష్టంగా 'బిల్డ్ నౌ'!

- ప్రకటనలకే పరిమితం.. అమలుకు ఆమడ దూరం?
- అనుమతులకు ఏకీకృత విధానంపై భిన్నాభిప్రాయాలు



హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ ): రాష్ట్రంలో ప్రస్తుతం ఎంతో సాఫీగా సాగిపోతున్న భవనాలు, లేఅవుట్ల అనుమతి విధానానికి కాంగ్రెస్ ప్రభుత్వం మోకాలడ్డు పెట్టింది. 'బిల్డ్ నౌ' పేరుతో ఏదో కొత్త విధానం తెరపైకి తెచ్చింది. రియల్ అనుమతుల విషయంలో కాంగ్రెస్ మార్కు కోసం ఆరాటపడుతోంది. అయితే ఈ కొత్త విధానం రియల్టర్లను ఆందోళనకు గురిచేస్తోంది.. ఇప్పటికే డౌన్‌ఫాల్‌లో ఉన్న రియల్ వ్యాపారం మరింత ఊబిలోకి పోయే ప్రమాదం కొత్త విధానం వల్ల పొంచి ఉంది. రియల్ అనుమతుల కోసం ప్రస్తుతం అందుబాటులో ఉన్న టీజీఈపాస్ విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయనున్నది.. ఆ స్థానంలో కొత్తగా తీసుకువస్తున్న 'బిల్డ్ నౌ' ఏకీకృత ఆన్‌లైన్ పోర్టల్ విధానంలో అనేక లోపాలు తొంగి చూస్తున్నాయి. టీజీఈపాస్ విధానంలో 30 రోజుల్లో సాధ్యం కాని అనుమతులు.. ఏకీకృత విధానంలో కేవలం 5 నిమిషాల్లోనే సాధ్యమతాయని ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. కాని దీనిపైనా సంబంధిత శాఖకు చెందిన అధికారులు అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. నూతన అనుమతులు వ్యవస్థలో 5 నిమిషాల్లో ఎలా సాధ్యమవుతాయి? అన్న అంశంపై మరికొంత మంది అధికారులు మాత్రం నోరు మెదపడం లేదు. ఈ విధానంపై కనీసం పూర్తి స్పష్టత కూడా ఇవ్వలేక పోతున్నారు. కేవలం ఒక ప్రైవేటు సంస్థ రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను నమ్మి, రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకోవడంపైనా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోపక్క ఏఐ విధానం వల్ల ఇది సాధ్యమేనని, కాని దానిని సమర్థవంతంగా అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల అవుతుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి భవన నిర్మాణాలు, లేఅవుట్ల అనుమతులు పొందే విషయంలో రియల్ వ్యాపారులకు అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. ఇప్పటికే హెచ్‌ఎండీఏ/ మున్సిపాలిటీలు, జీహెచ్‌ఎంసీ, జీటీసీపీ అనుమతులు పొందడంలో అనేక సమస్యలు పరిష్కరించుకోవాలి. ఆ అనుమతుల కోసం సంబంధిత భూములకు సంబంధించి నకిలీ సర్టిఫికెట్లు దాఖలు చేసే అవకాశాలు ఉన్నాయి. ఫోర్జరీ సర్టిఫికెట్లు క్రాస్ వెరిఫికేషన్ చేసే యంత్రాంగం లేకపోయింది. ఈ కొత్త విధానానికి ' తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(టీజీరెరా)ని అనుసంధానం చేస్తామన్నారు. అయితే స్వతంత్రంగా వ్యవహరించే రెరాను ఈ పోర్టల్‌కు ఎలా అనుసంధానం చేస్తారన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది. నాన్-హై-రైజ్ భవన అనుమతులకు కూడా 21 నుంచి 15 రోజుల సమయం మాత్రం పడుతుందని చెప్తున్నారు.

### ప్రకటన కాదు.. అమలు ముఖ్యం: క్రెడాయ్ జాతీయ కార్యదర్శి రామిరెడ్డి

**రాష్ట్రంలో** రియల్ అనుమతుల కోసం ఎంతో ఆర్భాటంగా ఏకీకృత విధానం వచ్చే ఏడాది ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి తీసుకువస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఈ అంశంపై రియల్ ఎస్టేట్ సంస్థలు కూడా స్పందిస్తున్నాయి. వీరిలో కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఏఐ విధానంలో 5 నిమిషాల్లో రియల్ అనుమతులు ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. కాని ఆచరణ విషయంలో ఎవరికీ నమ్మకం లేదని క్రెడాయ్ జాతీయ కార్యదర్శి రామిరెడ్డి అన్నారు. ఈ విధానం రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి కాకుండా ట్రయల్ రన్ నిర్వహించాలని ప్రభుత్వానికి పలు సూచనలు చేస్తున్నారు. కాని తొందరపాటు నిర్ణయాల వల్ల రియల్ వ్యాపారులు అనుమతుల విషయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశాలు ఉంటాయని, దాని ప్రభావం రియల్ వ్యాపార రంగంపై పడే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# యువజన హామీలపై ఊసేది?

- పెద్దపల్లి సభ విమర్శలపాలు
- నిరుద్యోగ భృతి ఊసెత్తని సీఎం
- సింగరేణి ముచ్చటే తీయలే..



పెద్దపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్న యువవికాసం బహిరంగసభకు ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో ఖాళీకుర్చీలతో దర్శనమిస్తున్న ప్రాంగణం

కరీంనగర్, డిసెంబర్ 4(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ప్రజాపాలన-విజయోత్సవాల పేరిట రాష్ట్ర ప్రభుత్వం బుధవారం పెద్దపల్లి జిల్లాకేంద్రంలో నిర్వహించిన యువవికాసం బహిరంగ సభ.. యువకులకు ఇచ్చిన పలు హామీలను విస్మరించింది. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రధాన శాఖల మంత్రులు హాజరైనా యువజనానికి భరోసా దక్కనేలేదు. ఈ సభపై నిరుద్యోగులు పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయి. ఆరు గ్యారెంటీల్లో భాగంగా యువవికాసం కింద విద్యార్థులకు ఇస్తామన్న రూ.5 లక్షల విద్యాభరోసా కార్డులపై ముఖ్యమంత్రి మాట కూడా మాట్లాడలేదు. యూత్ డిక్లరేషన్‌లో ఏటా 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చింది. ఈ ఏడాదిలో 55,143 ఉద్యోగాలు ఇచ్చి చరిత్రను తిరగరాశామని సీఎం చెప్పుకొచ్చారు. అంటే యువవికాసం సభ సాక్షిగా మొదటి ఏడాదిలోనే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయలేకపోయామని ఒప్పుకున్నట్టే కదా? అని నిరుద్యోగ యువత పెదవి విరుస్తున్నది. నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతిపై మాటమాత్రమైన సీఎం, మంత్రులు చెప్పలేకపోయారు. కేసీఆర్ ప్రభుత్వం ఎగ్గొట్టిన రైతుబంధు 7,625 కోట్లను తమ ప్రభుత్వం రాగానే ఇచ్చిందని సీఎం ఓ అబద్ధం ఆడారు. సభకు వచ్చిన పలువురు మధ్యలోనే వెనుదిరిగవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి.

### ప్లకార్డులతో సింగరేణి కార్మికుల పిల్లల నిరసన

యువవికాసం సభలో మంత్రి శ్రీధర్ బాబు ప్రసంగిస్తుండగా రామగుండం నియోజకవర్గానికి చెందిన సింగరేణి కార్మికుల పిల్లలు వివిధ డిమాండ్లతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. 25 మంది వరకు నినాదాలు చేశారు. సింగరేణిలో మారు పేర్ల సమస్యను పరిష్కరించాలని నినదించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అక్కడికి చేరుకొని వారిని శాంతింపజేశారు.

# మంత్రుల భూమాయ!

మొదటిపేజీ తరువాయి...

ఉండటంతో ఒక్కో ఎకరం రూ.10 కోట్లు విలువ చేస్తున్నది. అంటే.. మంత్రులు కన్నేసిన దాదాపు 400 ఎకరాల భూమి విలువ రూ.4వేల కోట్లకుపైనే. వీటిని వెంచర్లుగా మార్చి అమ్మి రూ.10వేల కోట్ల వరకు సొమ్ము చేసుకోవాలని ప్లాన్ చేసినట్టు తెలుస్తున్నది. ఇప్పటికే 100 ఎకరాల్లో వెంచర్ పనులు మొదలయ్యాయి. రెండు నెలలుగా గుట్టలను చదును చేస్తున్నా.. రెవెన్యూ యంత్రాంగం చేష్టలుడిగి చూస్తున్నది. వెంచర్ చుట్టూ ప్రహరీ, మధ్యలో చిన్న షెడ్ల నిర్మాణాలు జరిగిపోతున్నాయి. గతంలో ఒకసారి 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా హడావుడిగా ప్రహరీలో నాలుగు అడుగులు కూల్చి మమ అనిపించారు.

### 1994లోనే రద్దయిన ఓఆర్సీలు

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం సుల్తాన్‌పూర్ 1348 ఫస్లీ సంవత్సరానికి సంబంధించిన తొలి పహాణీలో పన్‌మక్తా ఫరీదుద్దీన్ పేరు మీద పహాణీలు ఉన్నాయి. సర్వే నంబర్ 30లో మొత్తం722.20 ఎకరాల భూమి ఉన్నది. ఇందులో 90 ఎకరాలు బొమ్మన్‌కుంట చెరువు శిఖం. మిగిలినదంతా కొండలు, గుట్టలతో కూడిన భూమి. ఫరీదుద్దీన్ మరణానంతరం ఇనాం రద్దయ్యింది. అప్పటి నుంచి రెవెన్యూ రికార్డుల్లో అవి ప్రభుత్వ భూములుగా ఉన్నాయి. 1986 జూన్‌లో అప్పటి సంగారెడ్డి ఆర్డీవో ఇనాందారుల వారసులను సృష్టించి, వారికి 432.25 ఎకరాల మీద ఓనర్‌షిప్ రైట్స్ సర్టిఫికెట్ (ఓఆర్సీ) జారీ చేశారు. ఇనాందార్లు అదే ఏడాది ఆ స్థలాన్ని భూ మాఫియా స్మగ్లర్ వాలా నారాయణ రావుకు విక్రయించారు. దీంతో లేని వారసులను సృష్టించి ప్రభుత్వ భూమిని కబ్జా పెట్టే ప్రయత్నం చేస్తున్నారంటూ 1993లో అప్పటి ఇందుర్తి ఎమ్మెల్యే దేశిని చినమల్లయ్య అసెంబ్లీలో లేవనెత్తారు. వెంటనే ప్రభుత్వం స్పందించి, అప్పటి సీసీఎల్‌ఏ కమిషనర్ ఎస్‌ఎన్ మొహంతిని విచారణ అధికారిగా నియమించింది. ఆయన 1994 ఏప్రిల్‌లో ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఓఆర్సీల జారీలో సంగారెడ్డి ఆర్డీవో అక్రమాలకు పాల్పడ్డాని ధ్రువీకరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 1994 జూన్ 14న అప్పటి ఉమ్మడి మెదక్ జిల్లా జాయింట్ కలెక్టర్.. ఇనాందారుల వారసుల పేరుతో జారీ చేసిన ఓఆర్సీలను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అక్రమంగా సర్టిఫికెట్లు జారీ చేసిన ఆర్డీవోను విధుల నుంచి తప్పించారు. అప్పటి నుంచి 432 ఎకరాల భూమి ప్రభుత్వ ఆధీనంలోనే ఉన్నది. మరో 242 ఎకరాల భూమి రైతుల పేరుతో ఉన్నప్పటికీ, సాగుకు అనువైన భూమి కాకపోవడంతో క్షేత్రస్థాయిలో ఎవరూ సాగు చేయడం లేదు.

### పాత ఓఆర్సీలతో పట్టాలు.. అందరికీ వాటాలు

ఖాళీగా ఉన్న 432 ఎకరాలపై మంత్రులు కన్నేశారు. 1986లో అక్రమంగా ఓఆర్సీలు పొందిన కొందరు ఇనాందారుల వారసులను తెరమీదికి తెచ్చారు. ఆ ఓఆర్సీలకు పట్టాలు ఇవ్వాలని స్థానిక రెవెన్యూ అధికారులకు దరఖాస్తులు చేయించారు. వాస్తవానికి అవన్నీ 30 ఏండ్ల కిందటే రద్దయ్యాయి. అయినా పెద్ద మంత్రుల కనుసన్నల్లో రెవెన్యూ ఉన్నతాధికారులు పట్టాలు మంజూరు చేసే పనులు మొదలు పెట్టేశారు. ఇప్పటికే బై సర్వే నంబర్లు సృష్టించి కొందరికి పట్టాలు మంజూరైనట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ మొత్తం వ్యవహారంలో ఇద్దరు మంత్రులు, ఒక ఎమ్మెల్యే, ఉమ్మడి జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేత భాగస్వాములుగా ఉన్నట్టు తెలిసింది. ఇటీవలే బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఆ ఎమ్మెల్యే ఎప్పటి నుంచో ఈ భూములపై కన్నేసినట్టు ప్రచారంలో ఉన్నది. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో విఫల ప్రయత్నం చేసినా, ప్రభుత్వ భూములను కబ్జా పెట్టడానికి నాటి సీఎం కేసీఆర్, జిల్లా మంత్రి హరీశ్‌రావు అంగీకరించలేదని చెప్పుకుంటున్నారు. ఇప్పుడు పార్టీ మారగానే సదరు పెద్ద మంత్రికి భూముల వివరాలు చెప్పారని, మరో కాంగ్రెస్ నేతతో కలిసి కొత్త మంత్రితో డీల్ కుదిర్చారని సమాచారం. ప్లాట్లు అభివృద్ధి చేసిన తర్వాత భూమి యాజమాన్య హక్కు పత్రాలున్న ఇనాందార్ వారసులకు ఎకరాకు 750 గజాల చొప్పున ప్లాటు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నట్టు తెలుస్తున్నది. మిగతా భూమిలో పాత మంత్రికి 55 శాతం, కొత్త మంత్రికి 25 శాతం, ఎమ్మెల్యేకు 10 శాతం, కాంగ్రెస్ నేతకు 10 శాతం దక్కేట్టు ఒప్పందం చేసుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది.

### 100 ఎకరాల్లో వెంచర్

అటు రెవెన్యూ అధికారులు పని మొదలు పెట్టగానే.. ఇటు మొదటి విడతగా 100 ఎకరాల్లో వెంచర్ వేసేందుకు పనులు మొదలుపెట్టేశారు. ఆర్సీపురం మండల కేంద్రానికి చెందిన ఓ కాంగ్రెస్ నేత ఆధ్వర్యంలో రెండు నెలలుగా పనులు జరుగుతున్నాయి. భూమిని స్వాధీనంలోకి తీసుకొని దాని చుట్టూ ప్రహరీ నిర్మిస్తున్నారు. బుల్డోజర్లు, జేసీబీలు, లారీలతో కొండలు, గుట్టలు చదును చేసి, వెంచర్ వేస్తున్నారు. రాత్రింబవళ్లు పనులు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు కండ్లు మూసుకున్నారు. డిటోనేటర్లు పెట్టి రాత్రికి గుట్టలను పేల్చుతున్నా పోలీసులు, మైనింగ్ అధికారులు చెవులు మూసుకున్నారు. విద్యుత్తు శాఖ అధికారులు అగమేఘాల మీద కరెంటు స్తంభాలు వేసి ఎల్‌టీ లైన్ వేశారు. ఇప్పటికే మట్టి రోడ్ల పనులు పూర్తయ్యాయి. అక్కడక్కడ గదులు నిర్మించి, నల్లా కనెక్షన్లు సైతం తీసుకుంటున్నారు. ఏ ఒక్క అనుమతి లేకపోయినా ప్రభుత్వ యంత్రాంగం మొత్తం మిన్నకుండిపోయింది. ఎవరైనా అడిగే సాహసం చేస్తే మంత్రుల పేర్లు చెప్పి బెదిరిస్తున్నారని వాపోతున్నారు. ఒక డిప్యూటీ తహసీల్దార్‌ను ప్రశ్నించి నోటీసులు ఇస్తే వెంటనే ఆయనను బదిలీ చేశారని రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఓ రెవెన్యూ అధికారిని ప్రత్యేకంగా నియమించి పనులు దగ్గరుండి చేయిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది.



### 10వేల కోట్లకు టెండర్

పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతం కావడం, పక్కనే మెడికల్ డివైజెస్ పార్క్ ఉండటంతో ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఎకరాకు రూ.10 కోట్ల చొప్పున పలుకుతున్నట్టు స్థానికులు చెప్తున్నారు. వెంచర్‌గా అభివృద్ధి చేసి విక్రయిస్తే రూ.30 కోట్ల వరకు వస్తుందని వ్యాపారులు అంటున్నారు. ఈ లెక్కన దాదాపు 400 ఎకరాలకు లెక్కిస్తే.. మంత్రుల భూమాయ విలువ రూ.10వేల కోట్లకుపైనే అని చెప్తున్నారు. ప్రస్తుతం వేసిన 100 ఎకరాల వెంచర్ విలువే రూ.3వేల కోట్ల వరకు ఉంటుందని అంటున్నారు. పనులు తుది దశకు వచ్చాయని, త్వరలో ప్లాట్లను అమ్మకానికి పెడతారని చెప్తున్నారు. ఈ కబ్జాల మీద 'నమస్తే తెలంగాణ' ప్రతినిధులు గత నెలలో అమీన్‌పూర్ తహసీల్దార్ రాధ వివరణ కోరగా.. గుర్తు తెలియని వ్యక్తులు సర్వే నంబర్ 30లోని ప్రభుత్వ భూమిని కబ్జా చేసినట్టు తమ దృష్టికి కూడా వచ్చిందని, అక్రమంగా వేసిన ఫెన్సింగ్‌ను కూల్చివేస్తామని చెప్పారు. ఆ తర్వాత అధికారులు తూతూమంత్రంగా నాలుగడుగుల మేర ఫెన్సింగ్ కూల్చి మమ అనిపించారు. ఆ తర్వాత పనులు మళ్లీ యథావిధిగా సాగుతున్నాయని స్థానికులు చెప్తున్నారు.

# రోశయ్య వంటి సహచరుడు లేరు

- ఆయన నం.2గా ఉన్నా సీఎం పదవిని ఆశించలేదు
- అందుకే నాటి సీఎంలు ప్రశాంతంగా పాలించారు
- మాజీ సీఎంవర్ధంతి సభలో సీఎం

మాదాపూర్, డిసెంబర్ 4: దివంగత కొణిజేటి రోశయ్య వంటి సహచరుడు ఇప్పుడు లేకపోవడం తీరని లోటు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆయన ఎందరో ముఖ్యమంత్రులకు కుడిభుజంగా పనిచేశారని, అటువంటి వ్యూహకర్తలు లేని లోటు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నదని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి రోశయ్య 3వ వర్ధంతి సందర్భంగా బుధవారం మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో నంబర్ వన్ స్థానంలో ముఖ్యమంత్రులు ఎందరు మారినా నంబర్ 2 స్థానంలో పర్మినెంట్‌గా రోశయ్య ఉండేవారని అన్నారు. ఆయన ఏనాడూ ముఖ్యమంత్రి పదవిని ఆశించలేదని చెప్పారు. ముఖ్యమంత్రి పదవి ఆశించకుండా నమ్మకంగా ఉండటం వల్లనే మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, భవనం వెంకట్రామ్, టీ అంజయ్య, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వరకు అందరూ ప్రశాంతంగా అధికారం చెలాయించారని అన్నారు. ప్రస్తుతం తెలంగాణ శాసనసభలో రోశయ్యలా వ్యూహాత్మకంగా సమస్యలను పరిష్కరించగలిగిన సహచర నాయకులు లేకపోవడం లోటుగా ఉన్నదని అన్నారు. అలాంటి సహచరుడు ఉంటే ముఖ్యమంత్రిగా ఎవరైనా అద్భుతంగా రాణించొచ్చని చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రశ్నించాలి.. పాలకపక్షంలో ఉన్నప్పుడు పరిష్కరించాలి అని రోశయ్య చెప్పేవారని గుర్తు చేసుకున్నారు. రోశయ్యది రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం కాకపోయినప్పటికీ ఆయన ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా, వివిధ హోదాల్లో 50 ఏండ్లకు పైగా రాజకీయాల్లో గొప్పగా రాణించారని కొనియాడారు.

### ఆర్యవైశ్యులకు సముచిత స్థానం

రాష్ట్ర ఆర్థిక ఎదురుగదల ఆర్యవైశ్యుల చేతిలో ఉన్నదని, వారు తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లు కావాలని సీఎం పిలుపునిచ్చారు. ఆర్యవైశ్యుల వ్యాపారాలకు అనుమతులను ప్రభుత్వం సకాలంలో ఇస్తుందని చెప్పారు. హైదరాబాద్‌లో ప్రభుత్వం తరుపున రోశయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.